# దళిత రైతులకు చీకట్లు

- ఏడాదిన్నరగా కరెంట్ లేక ఇబ్బందులు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

తాంసి, జూన్ 22 : ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం ఘోట్కూరి గ్రామంలోని దళిత బస్తీ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాదిన్నరగా తమ పంట పొలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సాగు పనులు నిలిచిపోయాయని రైతులు వాపోతున్నారు. అధికారులకు తమ సమస్యలు పట్టించుకోవడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దళితుల కోసం అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పథకాల ద్వారా భూములు కేటాయించినప్పటికీ, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు. గ్రామంలోని పంట పొలాల్లో వేసిన విద్యుత్ స్తంభాలు నేలకొరిగి రెండు నెలలు దాటినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కరెంట్ తీగలు పొలాల్లో వేలాడుతున్నాయని, ఎప్పటికప్పుడు విద్యుత్ షాక్ ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు, అనంతరం జిల్లా స్థాయిలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి ఫిర్యాదు చేసిన స్పందన లేకపోవడం గమనార్హం. సక్రమంగా విద్యుత్ అందక పంట పనులు వాయిదా పడుతున్నాయని. తాము తీవ్రంగా నష్టపోతున్నామని లబ్ధిదారులు పసుల లక్ష్మి స్వామి, నిమ్మల సరిత సురేశ్ తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దళితుల కుటుంబాల్లో వెలుగులో నింపి భూములు ఇవ్వడమే కాక, సాగుకు అవసరమైన మూలిక సదుపాయాలు కల్పించారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం కరెంట్ కూడా అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దళిత రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాల్సిందిగా వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


ప్రారంభానికి ముందే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విరిగిన విద్యుత్ స్తంభం



ఘోట్కూరిలోని పంట పొలంలో వంగిపోయిన విద్యుత్ స్తంభం

# సదర్మాట్ కాలువకట్టకు తూట్లు

- కట్టను తవ్వి నీటిని తరలించేందుకు పైపులైన్ ఏర్పాటు

ఖానాపూర్ రూరల్, జూన్ 22 : అనుమతి లేకుండా సదర్మాట్ కాలువ కట్టకు కొందరు వ్యక్తులు తూట్లు చేసి నీటిని మళ్లించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం గోసంపల్లె శివారులోని సదర్మాట్ ఆయకట్టు కాలువ కట్టను జేసీబీతో తవ్వి లోపలి నుంచి పైపులైన్ అమర్చుకున్నారు. ఏకంగా కట్ట పక్కనే ఉన్న ఓ వ్యవసాయ బావికి నీటిని మళ్లించేందుకు ఏర్పాట్లు చేశారు. అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించగా నీటి పారుదల శాఖ జేఈ రవి, కాలువ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి చూశారు. అనుమతి లేకుండా ఎందుకు కట్టను తవ్వారని, వెంటనే పైప్‌లైన్ తొలగించాలని ఆ వ్యక్తులకు ఆదేశించారు. తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇష్టానుసారంగా తవ్వితే కట్ట దెబ్బతిని వర్షాకాలం గండ్లు పడుతాయని హెచ్చరించారు. అధికారులు చెప్పినా పైపులైన్ తొలగించక పోయేసరికి గ్రామస్తులు మండిపడుతున్నారు.


సదర్మాట్ కాలువకు పైపులైన్ కోసం తవ్విన గుంత


కాలువపై అనుమతులు లేకుండా తవ్వి పూడ్చిన సదర్మాట్ కాలువ కట్ట

## భవనాన్ని ప్రారంభించారు.. వసతులు మరిచారు


పిల్లర్ల దశలో నిలిచిపోయిన కిచెన్ షెడ్డు

పెంబి, జూన్ 22: నిర్మల్ జిల్లా పెంబిలో పాత పాఠశాల శిథిలావస్థలో ఉండడంతో రూ.1.20 కోట్లతో నూతన పాఠశాల భవనాన్ని నిర్మించారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు ప్రహరీ, కిచెన్ షెడ్డు, మైదానం నిర్మాణాలు పూర్తికాక ముందే గతేడాది అక్టోబర్ 29వ తేదీన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఎంపీ నగేశ్ పాఠశాలను ప్రారంభించారు. భవనం ప్రారంభించనప్పటికీ అందులో కనీస సౌకర్యాలు లేకపోవడంతో వేసవి సెలవులు పూర్తయ్యే వరకు శిథిలావస్థ భవనంలో తరగతులు కొనసాగించారు. ఈ భవనంలో గదులు ఇబ్బంది కరంగా ఉండడంతో జూన్ 12వ తేదీన నూతన పాఠశాల భవనానికి విద్యార్థులను తరలించి తరగతులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 150 మంది విద్యార్థులు చదువుతున్నారు. అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మైదానం, కిచెన్ షెడ్డు నిర్మాణాలు పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని ఎంఈవో రాంచందర్ కోరుతున్నారు. పంచాయతీ రాజ్ ఏఈని వివరణ కోరగా మైదానం, కిచెన్ షెడ్డు నిర్మాణాల కోసం అనుమతులు పంపినట్లు తెలిపారు.


అసంపూర్తిగా వాస్ బేషన్

## వృద్ధులు యోగా, నడక అలవాటు చేసుకోవాలి

ఎదులాపురం, జూన్ 22 : వృద్ధులు దీర్ఘ కాలిక వ్యాధుల నుంచి దూరంగా ఉండేందుకు నిత్యం ధ్యానం, యోగా, వాకింగ్ అలవాటు చేసుకోవాలని వయోవృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేవీదాస్ దేశ్ పాండే అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లో వయోవృద్ధుల సమాఖ్య కార్యాలయంలో డయాగ్నోస్టిక్ రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ ప్రఫుల్ వర్షే ఆధ్వర్యంలో మధుమేహంపై అవగాహన కల్పించారు. అదే విధంగా మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా డీడబ్ల్యూవో సిబ్బంది మత్తు పదార్థాలపై సమాఖ్య సభ్యులు, వృద్ధులకు అవగాహన కల్పించారు. అనంతరం నశముక్త్ భారత్ పేరిట అవగాహన ర్యాలీ తీశారు. కార్యక్రమాల్లో వయోవృద్ధుల సమాఖ్య కార్యదర్శి రాంకులకర్ణి, వామన్‌రావ్. హన్మంత్ రెడ్డి, గంగాధర్, నశముక్త్ భారత్ సీఈ సాయి కిరణ్, డీడబ్ల్యూవో ఎఫ్తార్ పోశెట్టి, డవ్ నిర్వాహకులు దేవేంద్ర పాల్గొన్నారు.

# రహదారి కాదు.. నరక దారి


పెద్ద పెద్ద బండరాళ్లతో వేసిన రోడ్డు

బేల, జూన్ 22: జైనథ్ మండలం కాప్రి నుంచి దహేగావ్ వరకు 11 కిలో మీటర్ల అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణ పనులు ప్రారంభమై సంవత్సరం దాటినా ఇంకా రాలేని నిధులు, అర్థాంతరంగా నిలిచిపోయిన పనులు ప్రజలను అష్టకష్టాల్లోకి నెట్టాయి. గతంలో ఉన్న బీటీ రోడ్డును తవ్వి వదలడంతో, ఇప్పుడు రోడ్డు వర్షపు నీళ్లతో బురదమయంగా మారింది. ఆటోలు నడవడం లేదు. ఇవ్వన్నీ చూసిన విద్యార్థులు ఐదు కిలోమీటర్ల కాలినడకనే వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని మొరంతో రోడ్డు వేసి కష్టాలు తొలగించాలని విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించే వరకు ఉద్యమిస్తాం

ఖానాపూర్, జూన్ 22: ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఖానాపూర్‌లోని కుమ్రం భీం చౌరస్తాలోని 110 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నిర్మించే వరకు సాధన కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని జేఏసీ కన్వీనర్ నంది రామయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో స్థలం లేక ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు తరలించామని కాంగ్రెస్ నాయకులు చెప్పడం సిగ్గుచేటు అన్నారు. గతంలో అధికార పార్టీకి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ రాజురా సత్యం అటవీ శాఖ కార్యాలయానికి ఇచ్చిన 32 ఎకరాల స్థలాన్ని తిరిగి వెనక్కి తీసుకున్నట్లు చెప్పి, ప్రస్తుతం ఖాళీ స్థలం లేదని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులు ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటులో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తే జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. పార్టీలకతీతంగా నియోజవర్గంలోని నాయకులు, ప్రజలు పోరాడాలన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు సాగి లక్ష్మణ్‌రావు, ఆకుల శ్రీనివాస్, గంగారావు, బీసీ రాజన్న, నారాయణ, ప్రదీప్, రాజు, రవీందర్, ఉపేందర్ పాల్గొన్నారు.

## ఆదివాసీ బిరుదు గోండ్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఉట్నూర్, జూన్ 22 : ఆదివాసీ బిరుదు గోండ్ తోటి (పీవీటీజీ) సేవా సంఘం రాష్ట్ర కమిటీని ఆదివారం ఉట్నూర్‌లోని గిరిజన భవన్‌లో ఎన్నికల కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా పెందూర్ ఆనంద్‌రావ్, రాష్ట్ర అధ్యక్షుడిగా మర్సుకోల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా తొడసం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా దస్రు, కార్యనిర్వహణ అధ్యక్షులుగా ఆత్రం సంతోష్, కుమ్ర మోతీరాం, రాష్ట్ర కోశాధికారులుగా మెస్రం శంకర్, పృథ్వీరాజ్, కార్యదర్శులుగా రాజేశ్, రమేశ్, పవన్, శ్రావణ్, అశోక్‌ను ఎన్నుకున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

ఎదులాపురం, జూన్ 22 : కొత్త స్కూళ్లు ప్రారంభించడం కన్నా ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సారించాలని టీపీస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనపరిచే విధంగా నూతన గురుకులాల ఏర్పాటు జరుగుతోందని విమర్శించారు. ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతుల ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, హెల్త్‌కార్డులు, పెండింగ్ బకాయిలు విడుదల వంటి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కిష్టన్న, ప్రధాన కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు సూర్య కుమార్, కోశాధికారి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు స్వామి, ఇస్తారి, గౌస్ మొహియుద్దీన్, శివన్న, గణేశ్, సోషల్ మీడియా కన్వీనర్ శంకర్, జిల్లా కమిటీ సభ్యులు, మండలాల బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ, జూన్ 22: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని గిరిజన పెట్రోల్ బంకులో నోజల్ వర్కర్ నాలుగు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జీసీసీ మేనేజర్ రాథోడ్ గులాబ్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు తాత్కాలిక ప్రాతిపాదనలో భాగంగా ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక గిరిజన యువతీ, యువకులు పదో తరగతి చదివి 18 ఏళ్లు నిండిన అభ్యర్థులు అర్హులని, ఆసక్తి గల వారు దరఖాస్తులను జీసీసీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మిగిలిన వివరాలకు ఫోన్ నంబర్లు 9182523278, 9441047539 ద్వారా అకౌంటెంట్ జాదవ్ రమేశ్, సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

## ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన కానిస్టేబుల్

బాసర, జూన్ 22 : నిర్మల్ జిల్లా బాసరలోని గోదావరి వద్ద ఆదివారం ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను కానిస్టేబుల్ మోహన్ సింగ్ కాపాడారు. కుటుంబ కలహాలతో నిజామాబాద్ జిల్లా నవిపేట్ మండలానికి చెందిన గున్నాల లింగవ్వ బాసరలోని గోదావరి వద్దకు ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చి తిరుగుతుండగా గమనించిన కానిస్టేబుల్ వెంటనే ఆమె వద్దకు వెళ్లి విషయం తెలుసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులను పిలిచి అప్పగించారు.

## బాసర ఆలయానికి నిధులివ్వాలి

భైంసా, జూన్, 22 : బాసర ఆలయానికి నిధులివ్వాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు భైంసా ఎమ్మెల్యే రామారావు పటేల్ విన్నవించారు. హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో ఆదివారం గవర్నర్‌ను ఎమ్మెల్యేతో పాటు, బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బాసర ఆలయ పునర్నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.42 కోట్లు ఇచ్చిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేసి పునర్నిర్మాణ పనులు ప్రారంభించేలా ఆదేశాలివ్వాలని కోరారు. పుష్కరాల వరకు ఆలయ పునర్నిర్మాణం చేపడితే భక్తులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. బాసర నుంచి మహోర్‌కు జాతీయ రహదారిని అనుసంధానించాలని కోరారు.

## ఉపాధ్యాయులను తనిఖీ అధికారులుగా నియమించడం సరికాదు

నిర్మల్ చైన్‌గేట్, జూన్, 22: ప్రభుత్వ పాఠశాలలో పర్యవేక్షణలో భాగంగా ఉపాధ్యాయులను తనిఖీ అధికారులుగా నియమించడం సరికాదని, దీనిని వ్యతిరేకిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ బలోపేతం చేయడంలో భాగంగా రెండు శాతం ఉపాధ్యాయులను తనిఖీ అధికారులుగా నియమించాలనే ఉత్తర్వులు సరికాదన్నారు. వెంటనే పాఠశాల విద్యాశాఖలో నూతనంగా సర్వీసు రూల్స్ రూపొందించి రెగ్యులర్ ఎంఈవోలు, డిప్యూటీ ఈవో పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

## రైతుల ఖాతాల్లో రూ.246.86 కోట్లు జమ

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 22: నిర్మల్ జిల్లాలో రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో రూ.246.86 కోట్ల నిధులు జమ అయినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. జిల్లాలో మొత్తం 1,86,400 మంది రైతులకు గాను 1,82,896 మంది ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా నిధులు చేరాయని వివరించారు. మిగిలిన రైతులకు త్వరలోనే నిధులు జమ చేస్తామని తెలిపారు.

## రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నిర్మల్ అర్బన్, జూన్, 22 : రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు పలువురు క్రీడాకారులు ఎంపికైనట్లు కిక్ బాక్సింగ్ సెక్రటరీ లక్ష్మి తెలిపారు. ఆదివారం నిర్మల్‌లోని సహస్ర బాక్సింగ్ అకాడమీలో పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో కౌశిక్‌రెడ్డి, వేద్, వినయ్, శ్రీనివాస్, బాలికల విభాగంలో అక్షయ, గీతాంజలి, దివ్య, సుజల, నక్షత్ర, గంగాలక్ష్మి, ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారు ఈ నెలలో 28 నుంచి 29వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో చిల్డ్రన్స్, జూనియర్, సీనియర్ బాలబాలికల పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సహస్ర బాక్సింగ్ అకాడమీ కోచ్ చందుల స్వామి, కిక్ బాక్సింగ్ కార్యవర్గం రాజశేఖర్, చిరంజీవి, విజయ్, మనిషా, శ్రీజ పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ మృతి

ఎదులాపురం, జూన్ 22 : ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న 1998 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ పద్మావార్ ప్రకాశ్ ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉట్నూర్‌కు చెందిన ప్రకాశ్ అంత్యక్రియల్లో ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొని నివాళులర్పించారు. తక్షణ సాయం కింద కుటుంబ సభ్యులకు రూ.30 వేలు అందజేశారు. ప్రకాశ్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇక్కడ సీఐలు సీహెచ్ కరుణాకర్ రావు, మొగిలి, ఎస్ఐ మనోహర్ ఉన్నారు.

## పాఠశాలలో విద్యార్థినులతో శ్రమదానం

ఇంద్రవెల్లి, జూన్ 22: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామ సమీపంలోని గురుకులం పాఠశాల ఆవరణలో విద్యార్థినులతో పిచ్చి మొక్కలు, పిచ్చిగడ్డి తొలగించే పనులు చేయించారు. ఆదివారం పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులకు తమ పిల్లలు పని చేస్తూ కనిపించడంతో ఆందోళన చెందారు. పాఠశాలలో పని చేసే వర్కర్లు మాత్రం చూస్తూ ఉన్నారని పిల్లల తల్లిదండ్రులు తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ శ్రీ ప్రియను సంప్రదించగా పిల్లలతో పనులు చేయించడం లేదని, ఆదివారం సెలవు దినం కావడంతో ప్రతి రోజూ తరగతి గదిలో ఉంటున్న విద్యార్థినులకు ఒక ప్రాక్టికల్ లాగా కాలక్షేపం కోసం పాఠశాల ఆవరణలోకి తీసుకువచ్చి ఇతర కూలీలు, బ్లేడ్ ట్రాక్టర్‌తో కొనసాగుతున్న ప్లే గ్రౌండ్ పనుల్లో భాగంగా అక్కడక్కడ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారని తెలిపారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఖానాపూర్, జూన్ 22 : విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌లాంటి నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఖానాపూర్ ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ సూచించారు. ఆదివారం డ్రగ్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ సరఫరా చేసినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎంఏ గఫూర్, మహేశ్, రాజశేఖర్, వసంత్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సోన్, జూన్ 22: ప్రభుత్వం నిషేధించిన గంజాయి, డ్రగ్స్ తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని నిర్మల్ ఎస్ఐ లింబాద్రి హెచ్చరించారు. నిర్మల్‌లోని వైఎస్సార్ కాలనీలో గంజాయి, డ్రగ్స్‌లాంటి మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

ఎదులాపురం, జూన్ 22: మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీస్ శాఖ తరఫున కృషి చేస్తున్నామని టూటౌన్ సీఐ కరుణాకర్ రావు అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్‌లోని కలెక్టర్ చౌరస్తా వద్ద టూ టౌన్ ఆధ్వర్యంలో నేను మాదక ద్రవ్య వ్యతిరేక సైనికుడిని అనే బోర్డును ప్రారంభించారు. స్థానికులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.కార్యక్రమంలో ఎస్ఐ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సారంగాపూర్, జూన్ 22 : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని స్వర్ణ గ్రామంలో ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్‌తో కలిగే నష్టాల గురించి వివరించారు. ఎవరైనా మత్తు పదార్థాలు రవాణా చేసిన పోలీస్ వారికి, టోల్‌ఫ్రీ నంబర్ 100 లేదా 1908 లేదా 8712671111 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు వినోద్, మాధవ్, వినిల్, ఇక్బాల్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

నార్నూర్, జూన్ 22 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు అలంఖాన్‌కు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్ అతని ఇంటికి వెళ్లి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట నార్నూర్ సహకార సంఘం చైర్మన్ సురేశ్, పట్టణాధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, సుల్తాన్‌ఖాన్, అసన్‌ఖాన్, హైమద్, అశోక్ ఉన్నారు.

## విశ్వకర్మ మరాఠీ వడ్రంగి సంఘం ఎన్నిక

తాంసి, జూన్ 22: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం పొన్నారి గ్రామంలో తాంసి, భీంపూర్ మండలాల విశ్వకర్మ మరాఠీ వడ్రంగి సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాంసి, భీంపూర్ మండలాధ్యక్షుడిగా లాండె విలాస్, ఉపాధ్యక్షుడిగా గౌకర్ విలాస్, ప్రధాన కార్యదర్శిగా కాయర్కర్ ప్రమోద్, కోశాధికారిగా జోడే రామును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు జాన్వె సంతోష్, దిలీప్, సంతోష్, ఆకాశ్, రాజు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల వేటగాళ్ల ముఠా అరెస్ట్

- అడవి అలుగుతో పాటు సెల్ ఫోన్లు, కారు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్‌డీవో భవానీ శంకర్

ఖానాపూర్, జూన్ 22: కవ్వాల్ అభయారణ్యంలో సంచరించే అడవి అలుగు వేటగాళ్లను అటవీశాఖ అధికారులు మూడు రోజుల క్రితం పట్టుకున్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ అటవీశాఖ కార్యాలయంలో ఖానాపూర్ ఎఫ్‌డీవో భవానీ శంకర్, ఎఫ్ఆర్వో కిరణ్ నిందితుల వివరాలను వెల్లడించారు. కొంతకాలంగా ఖానాపూర్ ప్రాంతం నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర దేశాలకు అడవి అలుగులను సరఫరా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు నిందితులను పట్టణంలోని తెలంగాణ చౌరస్తా వద్ద ముగ్గురిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి సేకరించిన వివరాల ప్రకారం ఖానాపూర్, నిజామాబాద్, జగిత్యాల, ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఏడుగురు నిర్మల్ జిల్లా దిమ్మదుర్తి రేంజ్ పరిధిలోని రాజురా అడవుల్లో అలుగును పట్టుకున్నారు. కారులో తరలిస్తుండగా అలుగుతో పాటు పది సెల్ ఫోన్లు, కిలో అడవి అలుగు అవశేషాలు, ఒక షిఫ్ట్ కారు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పట్టుబడ్డ వారిలో ఫయాజ్ అహ్మద్, గంగా ప్రసాద్, అహ్మద్‌ఖాన్, గణేశ్, బారిక్‌రావు, నగేశ్, విజయ్, శ్రీరాం, నాగోరావ్, రియాజ్ అహ్మద్ ఉన్నారు. వీరికి సహకరించిన వారిని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. వన్యప్రాణులను వేటాడితే క్రిమినల్ కేసుల తప్పవని హెచ్చరించారు. డీఆర్వో మహేశ్, ఎఫ్ఎస్వో రవీందర్, బీట్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.


స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, అలుగు పాత అవశేషాలు

# భైంసాలో భారీ చోరీ

- 31 తులాల బంగారం అపహరణ

భైంసా, జూన్, 22 : నిర్మల్ జిల్లా భైంసాలోని రాహుల్‌నగర్‌లో గల గజ్జారాం ఇంట్లో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే రాహుల్‌నగర్‌లో గజ్జారాం తన కుటుంబ సభ్యులంతా కలిసి బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి రాగా ఇంట్లో వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పట్టణ సీఐ గోపీనాథ్ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. ఈ విషయమై బాధితుడిని అడగగా సుమారు 31 తులాల బంగారం, రూ.30 వేల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. అనంతరం పట్టణ సీఐ మాట్లాడుతూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దొంగలను పట్టుకుంటామన్నారు.

## అదుపు తప్పిన కారు : ముగ్గురికి గాయాలు

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 22 : నిర్మల్‌లోని గుల్జార్ మార్కెట్‌లో ఓ కారు అదుపు తప్పిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..నిర్మల్‌లోని పోలీస్ స్టేషన్ వైపు నుంచి ఆదివారం మార్కెట్ వైపు వస్తున్న ఓ కారు మసీదు ఎదుట ఉన్న రెండు బజ్జీల బండ్లు, బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో శ్రీధర్, గౌస్‌ఖాన్‌కు చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. షేక్ అహ్మద్‌పై వేడి నూనె పడడంతో అతనికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ట్రాక్టర్ ఢీకొని మహిళా రైతు మృతి

పెంబి, జూన్ 22: నిర్మల్ జిల్లా పెంబి మండలం నాగాపూర్‌లో పొలాన్ని చదును చేయిస్తుండగా ట్రాక్టర్ వెనుక నుంచి ఢీకొనడంతో మహిళ రైతు పోలరాజు లక్ష్మి(40 ) మృతి చెందింది. ఎస్ఐ హన్మండ్లు తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మి తన పొలాన్ని ట్రాక్టర్‌తో చదును చేయిస్తున్నది. ట్రాక్టర్ డ్రైవర్ తలారి రాజేందర్ ట్రాక్టర్‌ను రివర్స్‌లో నడుపుతూ వెనుకాల నిలుచున్న లక్ష్మిని ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త భీమయ్య, కుమారుడు, కుతురు ఉన్నారు. భర్త, కుమారుడు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

# మోటార్ సైకిల్‌తో కలుపు నివారణ

భీంపూర్, జూన్ 22: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండల సరిహద్దు పెన్‌గంగ ఆవతలి మహారాష్ట్ర సగ్ధలో రైతు శ్రీనివాస్ మోటార్‌సైకిల్‌కు అరకను అనుసంధానం చేసి పత్తి చేన్లలో కలుపు నివారణ పనులు చేశారు. సాధారణంగా అయితే అరకకు ఎద్దులు కట్టి డౌర అరకతో కలుపు నివారణ చేస్తారు అ పద్ధతికి భిన్నంగా ఈ రైతు ఎద్దులు అవసరం లేకుండా మోటార్‌సైకిల్‌తో కలుపు నివారణ పనులు చేశాడు.


పత్తి చేన్లలో మోటార్‌సైకిల్‌కు అరక కట్టి కలుపు తీస్తున్న రైతులు

## అ'పూర్వ' సమ్మేళనం

నర్సాపూర్ (జీ), జూన్, 22 : నర్సాపూర్(జీ)లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984–85 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 40 ఏళ్ల తర్వాత మిత్రులందరూ ఒక చోట కలుసుకొని ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో శేషగిరి రావు, తెలుగు పండితులు సాంబశివరావు సార్, గణపతి రావు, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తాంసి, జూన్ 22 : తాంసి మండలంలోని కప్పర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు.


నర్సాపూర్ (జీ) : ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



తాంసి: కప్పరలో 2000–01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

## రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన వ్యక్తులపై కేసు

ఎదులాపురం, జూన్ 22: విడుతల వారీగా చెల్లించిన డబ్బుతో ప్లాట్ కొనుగోలు చేయగా, రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు మావల సీఐ స్వామి తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. రిక్షా కాలనీకి చెందిన చేనేత పని చేసే యములావార్ సవిత 2011లో సవిత భర్త యములావార్ నారాయణ (ఇప్పుడు మరణించాడు) ఖానాపూర్‌లోని కేఆర్‌కే కాలనీ, సర్వే నంబర్ 68/44లోని ప్లాట్ నం.114, 115ని వీ రాజిని (ఆదినాథ్ భార్య) నుంచి రూ.లక్షకు కొనుగోలు చేశారు. అప్పటి నుంచి సవిత భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి చేసిన అనేక ప్రయత్నాలు చేయగా విఫలమయ్యాయి. ఏ1 వీ రాజిని, ఏ 2 ఆదినాథ్, ఏ3 అండాల వెంకటస్వామిపై కేసు నమోదు చేసినట్లు మావల సీఐ తెలిపారు.

## ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

ఎదులాపురం, జూన్ 22: శాంతినగర్‌కు చెందిన ఆశగిరి హనుమాన్లు వద్ద నుంచి అదే కాలనీకి చెందిన రంగినేని శ్రీనివాస్ రూ.10 లక్షలు తీసుకొని హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. డబ్బులు తీసుకొని మోసం చేసిన రంగినేని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

## వంట గ్యాస్‌తో సీఎన్జీ ఆటోలో ఫిల్లింగ్

ఎదులాపురం, జూన్ 22: ఆదిలాబాద్‌లోని భుక్తాపూర్ వద్ద ఇందిరమ్మ కాలనీకి చెందిన ఎండీ మోబిన్ ఆటో డ్రైవర్ ఇంట్లో వాడే వంట గ్యాస్‌తో సీఎన్జీ ఆటోలో ఫిల్లింగ్ చేస్తున్న సమయంలో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. అతని వద్ద నుంచి ఫిల్లింగ్ చేసే పరికరాలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.